# భూకంపం

"స్వీయ కవితలు రేడియోలో ప్రసారం కావడమంటే మాటలా మజాకా! మనవాడు మన పటేల్‌పుర వీధి పరువు పెంచేస్తున్నాడురా!"

"నేను ముందే చెప్పిన, మనవాడెప్పుడో ఒకప్పుడు మహాకవై పోతాడని"

"నేటి మన రేడియో కవి రేపటి సినిమా కవి"

"నేటి పారుపల్లి వీధి కవి రేపటి ప్రపంచకవి"

కాయితాలు ఖరాబు చేస్తాడని అప్పుడు దెప్పి పొడిచాం గానీ ఇప్పుడు చూడంఁడ్రి మనవాడెంత ఎదిగిపోయిండో!"

మిత్రుల ప్రశంసలు మల్లేశ్ గుండెల్లో మల్లెపూల జల్లులు కురిపిస్తున్నాయి. పెదాల మీద చిరునవ్వు చిందులేసింది. పది నెలల క్రితం ఆకాశవాణికి పంపిన పది కవితల్లోంచి ముచ్చటగా మూడు కవితలు ఎంపికైనాయి. పది రోజుల క్రితం రికార్డింగ్ పూర్తయింది. ఈరోజు రేడియోలో తన గొంతు వినబడబోతుంది.

.... ఆనందం అందలమెక్కించింది. ఉల్లాసం ఉరకలు వేసింది విజయ గర్వం ప్రచార కార్యక్రమానికుసిగొల్పింది.

ఆ రోజు సాయంత్రం ఆరున్నర నుండి ఐదు నిమిసాల పాటు రేడియోలో మల్లేశ్ స్వీయకవితల ప్రసారం. కమ్మని కవితాగానానికి ముందు తియ్యని అల్పాహారం విందు. ఆహ్వానం అందుకున్న బంధు మిత్రులు సకుటుంబంగా సపరివారంగా వేంచేశారు. ఇంటికి పేరంటం కళ వచ్చేసింది.

వరండా ముఖ భాగములో తళతళలాడే పైవుడ్ టేబుల్ రాజాస్థానములో సింహాసనం లాగుంది దాని మీద కొత్త సెల్సులు బిగించిన బుల్లి రేడియో మిలమిల్లాడుతోంది టేబుల్ ముందు నాలుగు వరసల్లో కుర్చీలు అడ, మగ శ్రోతలు చెరో రెండేసి వరుసల్లో ఆసీనులైనారు. మగ శ్రోతల మధ్యలోంచి మల్లేశ్ వీడియో ఆపరేటర్‌కు సూచనలిస్తున్నాడు. ఆడ శ్రోతల మధ్యన శ్రీమతి మల్లేశ్ పట్టుచీర ఫెళఫెళలు .. ఆవిడ హడావుడి అంతా ఇంతా కాదు

హాయి గొలిపే ముచ్చట్ల మధ్య స్వీటు, ఖారా, చాయ . అల్పాహారం విందు ముగిసింది టైం ఆరూ ఇరవయ్యేదు. పెద్దల సైలెన్స్ సైగలతో టేం వనంలో వెలసిన వానలా కలకలం తగ్గుముఖం పట్టింది. రేడియో ఆన్ చేశాడో మిత్రుడు. టైం సరిగ్గా అరున్నరైంది.

"మల్లేశూ.. అరే నాన్నా మల్లేశూ... ఎంత పని జరిగిపోయిందిరా తండ్రీ..."

"ఇదేమిటీ . మల్లేశ్ గొంతు గిట్లుందా?" ఆశ్చర్యంతో తలమునకలయూరంతా.

"ఈ సంగతి విన్నావురా నాయనా. .!" రేడియో వెనక నుండి మల్లేశ్ నాయనమ్మ ప్రత్యక్షమైంది.

"కవితానందములో మొదట... రేడియో దారి రేడియోది. సౌండ్ ఎంత పెంచినా నానమ్మ సౌండ్ దాన్ని ఓవర్‌టేక్ చేసేస్తోంది. మల్లేశ్‌లో ఆగ్రహం అంగలేసింది.

"అబ్బా... రామాయణంలో పిడకల వేటలా నడుమ నువ్వెందుకే... నువు జేర ఆగవే అమ్మమ్మా!" శ్రీమతి మల్లేశ్ గొంతు చించుకుంది.

ముందున్న వాళ్లగ్గూడా రేడియో విన్పించడం లేదు.

"ముందు నా మాట వినురా. . లేకపోతే మరిచిపోతాను..." నానమ్మ గొంతు కీచుమంది.

"అయ్యో.. ఇప్పుడు నా కవిత్వం రేడియోలో వస్తుందే జుట్టు పీక్కున్నాడు "కొంచెంస్సేపాగవే!"

"పైత్యం చేసి వాంతులైతున్నాయా? ఎవరికిరా? నీకా, నీపెళ్ళానికా?" ఆందోళనతో రెచ్చిపోయింది నానమ్మ గుచ్చి గుచ్చి అడిగింది. కాస్సేపు వాగ్యుద్ధం శ్రోతల్లో కలకలం

"అయ్యో! ఇదేమిటమ్మమ్మా!" శ్రీమతి మల్లేశ్ చిరాగ్గా ముందుకొచ్చి మసలావిడ చేతులు పట్టేసింది నేరస్థురాలిని లాకప్‌లోకి లాక్కెల్లున్న పోలీసులా పక్కకు తీసుకుపొయింది.

ఇప్పుడు రేడియో వినబడుతుంది, కలకలం అగిపోయింది

"ఇంతవరకు శ్రీమల్లేశ్ గారి స్వీయ కవితలు విన్నారు. ఇప్పుడు..."

రేడియో ప్రకటన.

"బాగుంది. ప్రోగ్రాం చాలా బాగుంది"

"ఇలాంటి ప్రోగ్రాం ఎప్పుడూ వినలేదు. కనలేదు."

లేచిపోతున్నారంతా.

పిచ్చెత్తినట్లైంది మల్లేశంకు నెత్తినెక్కబోయిన వజ్రాల కిరీటం నేల పాలైనట్టనిపించింది.

"ఇంతకీ నీ సంగతేమిటే నానమ్మా?" అడిగాడు కుక్కర్‌లో కూరలా ఉడికిపోతూ.

"జపాన్‌లో మళ్లీ భూకంపవమొచ్చిదట్రా నాయనా! మధ్యాహ్నం టీ.వి.లో చెప్పింద్రురా" నానమ్మ మొహం పగిలిన దానిమ్మ పండులా విచ్చుకుంది." అన్నట్టూ ... ఒక్కరు గూడా చావలేదట్రా. ఈ సంగతి నీకు చెప్పాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. ఇప్పుడు దొరికింది సమయం.. "ఇంకేదేదో చెప్పకుపోతోంది. అందుకని నువ్విక్కడ, ఇప్పుడు భూకంపం సృష్టించినవా..." ఏడుపోస్తోంది. చొక్కా చించుకోవాలో, చెప్పతో కొట్టుకోవాలో అర్థంకాలవడం లేదు.

"బంగారం లాంటి ప్రోగ్రాంలో భూకంపం లేపావు గదే నానమ్మా ..." గోడు గోడుమన్నాడు. (మూసీ-ఏప్రిల్ - 1998)